# "ఏం మగవాళ్ళు?"

"రేవతీ... రేవతీ" క్రిష్ణ ఆఫీసునుంచి హడావుడిగా కేకలు పెడుతూ వచ్చాడు. అసలే పిక్చర్ ప్రోగ్రాంకి ఆలస్యమైపోతోందనే తొందర. ఆ ఆఫీసర్ వెధవ ఆరు గంటల వరకూ నిలిపేశాడు. మనస్సులోనే తిట్టుకుంటూ వర్కు పూర్తిచేసి తను రెక్కలు కట్టుకుని వాలితే రేవతి ఇంకా డ్రెస్ ఐనా కాకుండా ఈజీచైర్‌లో తాపిగా పడుకుని రేడియో సాంగ్స్ వింటోంది. క్రిష్ణకి అరికాలి మంట నెత్తి కెక్కింది. తను మధ్యాన్న భోజనంచేసేప్పుడే చెప్పాడు ఈ ప్రోగ్రాం సంగతి. వేణూ ఈ సరికి రెడీ అయి భార్యతో సహా వచ్చేస్తే... రేవతిమాత్రం తనని తను మరచిపోయి రఘు రామయ్య పాడుతున్న "అలిగితివా సఖీ ప్రియా" వింటోంది. ఈ పాటంటే రేవతికి ఎందుకో విపరీతమైన యిష్టం. రేవతి కాపరానికి వచ్చిన రెండు నెలల నుంచీ నాలుగైదు సార్లు చూశాడు. ఈ పాట వింటూ తనని తను మరచి ఏదో లోకా ల్లోకి తేలిపోతున్నట్లుగా వుంటుంది. తనకి చికాకు కల్గించే ఈ రికార్డు ఇప్పుడే రావాలా? క్రిష్ణకి సహనం నశించింది. "రేవతీ" గట్టిగా ఇల్లు అదిరేటట్లుగా గావుకేక పెట్టాడు.

తీయని వూహాలలో తేలిపోతున్న రేవతి వులిక్కిపడి బిక్క ముఖంతో లేచింది

“అవతల వేణు వచ్చేస్తుంటే నువ్వింకా రెడీకాకుండా ఇంకా ఏం చేస్తున్నావ్,” గద్దించి అడిగాడు. రేవతి స్తిమితపడి “అబ్బా ఇంతేగదా. ఇంకా ఏమిటో అనుకున్నాను. ఐనా నేను ఈ రోజు పిక్చర్‌కి రావటంలేదు.” అంది కాఫీ తీసుకురావటానికి లోపలికి వెడుతూ.

“ఆగు.... ఎందుకు రావటంలేదూ. అంతా నీ యిష్టమేనా ? నేను వేణుతో కూడా చెప్తే ... అతను కమలతో కూడా వచ్చేస్తానని చెప్పాడే. అనవసరంగా నాకు కోపం తెప్పించక తొందరగా రెడీకా. నాకేం కాఫీ అక్కరలేదు.” అన్నాడు కోపంగా బట్టలు మార్చుకుంటూ.

“అయితే ముఖమైనా కడుక్కోరా... మీకు ఇష్టమని గోధుమహల్వా చేశాను. కొంచెంతిని కాఫీ తాగండి. తర్వాత చెప్తాను అంతా” రేవతి భయపడుతూ చెప్పింది. క్రిష్ణ ఒక్కొక్కసారి ఎంతో ప్రేమగా దగ్గరగా తీసుకున్నా ఒక్కొక్కప్పుడు కస్సు బుస్సు మనే అతని ఆకృతిని అర్థం చేసుకోలేక తికమకపడుతుంది.

“ఎందుకు రావు నువ్వు ? ముందు ఆ సంగతి చెప్పు” అసహనంతో వూగిపోతూ అన్నాడు క్రిష్ణ.

“ఏమీ లేదండీ.... ఈ రోజు రాజా దగ్గరనుంచి లెటర్ వచ్చింది ఈ రాత్రి ట్రైన్‌కి వస్తున్నట్లు. మనని చూచేందుకు వైజాగ్ నుంచి ప్రత్యేకంగా వస్తుంటే మనం సినీమాకి వెడితే ఏం బాగుంటుంది? మీరే చెప్పండి. అందు

కని మేము రావటంలేదని కమలకి కబురు పంపాను వాళ్ళను వెళ్ళమని. మీరు త్వరగా వెళ్ళండి ట్రైన్ టైము అయింది. ఈలోగా నేను వంటరెడీ చేస్తాను. వెళ్ళివస్తారుకదూ" ప్రతి మాలింది ఎంతో నమ్రతగా. అసలే మండిపోతున్న క్రిష్ణ కోపం అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. రాజా.... ఈరాజా పేరు వింటేనే తనకి మంట. అతను ఎలా వుంటాడో చూడక పోయినా ఈ రాజా దగ్గరనుంచి రేవతికి వారానికో వుత్తరం వస్తూ వుంటుంది. రేవతికి వచ్చే వుత్తరాలు తనకి చదువా లని వుండదు. కాని రేవతి ఆ వుత్తరాలని ఎంతో జాగ్రత్తగా దాచుకుని మళ్ళీ మళ్ళీ చదువుకుంటూ వుంటుంది. ఈ ఆకర్షణ చూస్తేనే తనకి మంట.

ఒకరోజు పార్కుకి వెడదాం రెడికా రేవతి అన్నాడు క్రిష్ట. రేవతి అప్సరస లాగా తయారైంది. గ్రీన్ బిన్నీ జార్జెట్ చీర రేవతి అందాన్ని ద్విగుణీకృతం చేసింది. అదే కలర్ జాకెట్టు. ఆ డ్రెస్‌లో ఎంత అందంగా కన్పిస్తుంది. ఆమెను వెంటబెట్టుకు వెళ్ళాల్సి వస్తే ఏదో చెప్పలేని సంతృప్తి తనకి. దారిలో వాసూ, అతని భార్య గిరిజా కలిశారు. నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. వాసు రేవతిని పరీక్షించటం క్రిష్ణ సహించ లేకపోయాడు. ఏమిటి వీడిబొంద. బొత్తిగా సభ్యత లేకుండా అలా చూస్తాడు అనుకున్నాడు మనస్సులోనే.

"క్రిష్ణా! ఎలాగైనా నాగరికత ఈలాటి చదువుకోని వాళ్ళకి ఎలా వస్తుందోయ్! మీ రేవతికి ఈ గ్రీన్ శారీ చాలా బాగుంది.. ఎక్కడ కొన్నావ్. నేను ఎంత మంచివి

కొనాలన్నా మా గిరిజ వాకిట్లోకి వచ్చి వెధవ చవకబారు చీరలే సెలక్ట్ చేసుకుంటుంది. బొత్తిగా ఏమీ తెలియదు ఒట్టి అహంభావంతప్ప. చెల్లాయ్ కాస్త నీవన్నా సంస్క రించ వమ్మా మా గిరిజాని. ఇద్దరూ ఎక్కువగా కలుసు కుంటూ వుండ కూడదూ" అన్నాడు వాసు నిర్మలంగా నవ్వుతూ. గిరిజ ముఖం ముడుచుకు పోయింది. తను కట్టుకున్న చౌకబారు టెర్లిన్ చీరవైపు చూసుకుంది ఒక్కసారి. వాసుని ఒక్క సారి చూసింది కసిగా. అందరి ఎదుటా తనని చిన్న బుచ్చాడనే వుడుకులు మోతు తనంతో క్రిష్ణ హృదయం లోని అనుమానపు తెర తొలగిపోయింది.

వాసు చెల్లాయ్ అంటూ ఎంతో వాత్సల్యంతో పలకరించటంతో, ఇంటికి రాగానే అన్నాడు క్రిష్ణ. "రేవతీ ఈ చీరెలో నువ్వు ఎంత అందంగా కన్పించావు. ఎంత నిండుగా హుందాగా కన్పించావనీ. అక్కడే నిన్ను ఏం చేయా లన్పించిందనే!"

"ఏంచెయ్యాల్సి లన్పించిదీ... నయం అదృష్టవంతు రాల్ని. కొంపతీసి వాళ్ళ ఎదురుగా..." అతని కళ్ళల్లోకి కొంటెగా చూస్తూ దూరంగా జరిగింది?

"అప్పుడు మాత్రం ఎలాగో నిగ్రహించు కున్నా ఛాన్సు యిప్పుడుమాత్రం వదిలేది లేదు.

చేతులతో ఆమె ముఖం ఎత్తి కళ్ళల్లోకి చూస్తూ రేవతీ ... నేను నిజంగా చాలా అదృష్ట వంతుడిని. లేకుంటే ఈ అందాల భరిణని ఎలా పొందగలను? నేను నిన్ను పెళ్ళి పీటలమీదేగా చూసింది. మా అక్కయ్య నిన్ను

చూసి సెటిల్ చేసిందికదూ. ఐనా ఇంత అదృష్టం నన్ను వరిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు" అంటూ రెండు చేతులలోనూ బంధించేశాడు రేవతిని. వూపిరిసలపక వుక్కిరి బిక్కిరి ఐపోయి "అరే తలుపైనా సరీగా వెయ్య లేదు వుండండి. ఇప్పుడే వస్తాను." అంటూ తప్పించుకుని పారిపోయింది ఒక్కక్షణం తర్వాత గాని రేవతి తనకి మస్కా కొట్టి తప్పించుకున్న సంగతి గ్రహించ లేదు క్రిష్ణ.

"ఇదిగో అమ్మాయి, మర్యాదగా వచ్చావా సరే... లేకుంటే ఏమౌతుందో తెలుసా?"

"ఏమౌతుంది..." నవ్వుతూ ప్రశ్నించింది.

"ఏమౌతుందా ఇలాగవుతుంది......"

అంటూ ఎత్తి తీసుకువచ్చి పరుపుమీద పడుకోపెట్టి గట్టిగా పెదవులని నొక్కేస్తూ "నేనా అదృష్టవంతుడిని లేక నువ్వు చెప్పు అన్నాడు.

"మీరు కాదు. నేను, అదృష్టవంతురాల్ని" క్రిష్ణ షర్టుగుండీలు సరిచేస్తూ "ఇంత అందగాడూ నన్ను ఇంత ప్రేమించే వాడూ దొరకటం నా అదృష్టంకదూ. మా తాతయ్య మిమ్మల్ని చూసివచ్చి వర్ణించి చెప్తూవుంటే నా స్నేహితులు ఎగతాళి పట్టించేవాళ్ళు. మీ తాతయ్య చూసిన చిన్నవాడినే చేసుకుంటావా నువ్వు చూడకుండానే అంటూ. పెళ్ళికొడుకు చూడక్కర లేదుట పెళ్ళికూతుర్ని. వాళ్ళ అక్కయ్యవచ్చి చూస్తుందిట. ఇదేం విచిత్రం. ఎం ఏ చదువుతున్న పెళ్ళికొడుకు ఇలా అనటం వింతకదూ. పెళ్ళి కొడుక్కి ఏదైనా వంకర వుందేమో లేకుంటే చూడ!

టానికి ఎందుకు రాడు? ఇలా రకరకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు మా బంధుకోటి.

ఈ విమర్శలు విన్న నాగుండెలు దడదడా కొట్టుకునేవి. "అతనికి అక్కరలేకపోతే ఏం నువ్వు చూడాలని చెప్పవే అని సతాయించేవాళ్ళు నా స్నేహితులు. అమ్మమ్మ నోరునొక్కుకుంది నేను యీ సంగతి బయట పెట్టేటప్పటికి. "నలుగురూ నవ్వరుటే పెళ్ళికూతురే పెళ్ళికొడుకుని చూడలంటోంటే" అంటూ. ఇక గత్యంతరం కన్పించలేదు తాతయ్యకి. ఎలాగో కష్టపడి మీ ఫోటో సంపాదించి చూపించాడు నాకు. దానితో కొంత ఆరాటం తగ్గింది నాకు" నెమ్మదిగా బయట పెట్టింది రేవతి.

"అమ్మదొంగా నన్ను ముందు చూశావా? ఎంత అసాధ్యురాలివి. అరే నేనే నన్నమాటనిన్ను పెళ్ళిపీటలమీద చూసింది. ప్చ్!.... ఎప్పుడూ చెప్పలేదేం.... ఏదిఏమైతేనేం భగవంతుడికి ఆజన్మాంతం కృతజ్ఞుడిగా వుంటాను. ఏదీ... ఇంకొక్క సారి ....వూ...."

"అబ్బ వుండండి చీర నలిగిపోతుంది మార్చుకు వస్తాను."

"వుహు .... ఈ చీరెలోనే బాగున్నావు. వదిలేను లేదు."

"మీకు దణ్ణం పెడతాను బాబూ. ఈ చీరంటే నాకు ప్రాణం. పెళ్ళి ప్రజంటేషన్ కూడాను. రాజాకికూడా ఈ చీరెలోనే చాలా బాగుంటానుట. పాడుచేసుకోకుండా జాగ్రత్తగా వాడుకోవాలి"

“రాజా? రాజా ఎవరూ” వదిలేసి అడిగాడు ముఖం చిట్లిస్తూ.

రేవతి చీర జాగ్రతగా బీరువాలో దాస్తూ “రాజా తెలియదా ! ఓ ... నేనూ మరచిపోయాను. మన పెళ్ళికి రాలేదు కదూ. కాలేజీకి శలవులు లేవు. అందుకు రాలేదు. ఇక్కడికి తప్పకుండా రమ్మని వ్రాశాను. వచ్చింతర్వాత మీకు పరిచయం చేస్తానుగా. అబ్బ ఎంత అల్లరో! మీరే చూస్తారుగా” రేవతి ముఖం సంతోషంతో గులాబిరంగుకు తిరిగింది. క్రిష్ణ రక్తం వుడుకెత్తిపోయింది. రాజా అంటే ఎంత ఇష్టం వున్నా తన ఎదురుగా ఎంత ధైర్యంగా చెప్తుంది! రేవతిని అర్థం చేసుకో లేదాతను. తన మనస్సు ఎందుకో శంకిస్తోంది. ఛీ...ఏమిటీ అనుమానం. అమాయకంగా ఎప్పుడూ నవ్వుతూ తనని కవ్వించే ఆ కళ్ళకి తనని మాత్రమే మత్తెక్కించ గలిగిన శక్తి వుంది. ఇది నిజం. అనవసరంగా తను బాధపడుతున్నాడు!

‘ఏమిటో ఇతని ధోరణి క్షణానికి ఒకరకంగా మారుతూ వుంటుంది’. అనుకుంటూ నిశ్చింతగా నిద్రపోయింది రేవతి. క్రిష్ణ సిగరెట్టుమీద సిగరెట్టు కాల్చేశాడు. పెట్టె ఖాళీ ఐపోయింది. నిశ్చింతగా నిద్రపోతున్న రేవతి ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

క్రిష్ణకి ఈ సంఘటనలన్నీ ఒకదాని తర్వాత ఒకటి సినిమా రీలులాగా కళ్ళముందు తిరిగినాయి. తన మనస్సు ఎంతో సంతోషంగా గంతులు వేసేప్పుడే ఈ రాజా జ్ఞాప

కాలు ఏదో ఒకటి రేవతి గుర్తుచేయటం, ఇక తను మానసికంగా బాధపడటం- దీనికి పరిసమాప్తి ఎప్పటికో. ఎలాగైనా సరే ఇది అంతు తేల్చుకోవాలి ఈరోజుతో. తనకి ప్రాణప్రదమైన రేవతితో అతనుకూడా చనువుగా మాట్లాడితే తను సహించగలడా? తన ఆలోచనల్లో ఎదురుగా హల్వా ప్లేటుతో నుంచున్న రేవతిని గమనించ లేదు.

"అక్కరలేదని చెప్పలేదూ? నన్ను విసిగించక వెళ్ళిపో..." విసుగ్గా ఈజీఛైర్ లో కూలబడ్డాడు క్రిష్ణ.

రేవతికి ఏమీ అర్థంకాలేదు అతని ప్రవర్తన. ఎంతో హుషారుగా సినిమాకి వెళ్ళాలనివచ్చి, రాజాకోసం స్టేషన్ కి వెళ్ళమంటే ఇలా కళ్ళుమూసుకు పడుకోవటం ఎందుకో. ఎంతో ఇష్టమని గోధుమహల్వా చేస్తే కనీసం ముట్టుకోనైనా ముట్టుకోకుండా ఈ మూగనోము ఏమిటి? ఏదైనా ఆఫీసులో చికాకు కల్గివుండవచ్చు. సరిపెట్టుకుంది రేవతి తనని తను. నెమ్మదిగా దగ్గరికివచ్చి "కాస్త తినండి. చల్లారిపోతే బాగుండదు" బ్రతిమాలుతూ అడిగింది.

"........."

"రాక రాక రాజా మనయింటికి వస్తుంటే మీరు ఇలా మౌనంగావుంటే ఏం బాగుంటుంది చెప్పండి! మనం ముగ్గురం కలసి ఎంతో సరదాగా సినిమాలకీ, షికార్లకీ వెళ్ళచ్చని మరీ మరీ రాశాను. మీకు సరిగా ఈ సమయంలో ఇలావుంటే ఏం బాగుంటుంది? లెండి. టిఫెన్ తీసుకుని స్టేషన్ కి వెళ్ళి వద్దాం. నేనూ వస్తానుగా! ఐనా మీరురాజా ఫోటో చూశా [illegible]"

క్రిష్ణకి రాజాముఖం గుర్తుకువచ్చింది. కళ్ళజోడు వుండ టంవల్ల ముఖం బాగా తెలియకపోయినా నొక్కు-నొక్కుల క్రాఫ్‌మాత్రం మరిచిపోలేదు తను. అంత అందగాడు గనుకనే ఈరేవతికి అంత వ్యామోహం కాబోలు. చివరికి తెగించి యిక్కడికికూడా రమ్మని రాసిందా? ఎంతధైర్యం. కటువుగా అన్నాడు క్రిష్ణ "నేను స్టేషన్‌కిరాను... రాను. కావాలంటే నువ్వువెళ్ళు. నేను ఈ యింట్లో ఒక్క క్షణం వుండలేను" చరా చరా బయటికి వెళ్ళిపోయాడు.

ఈ అకారణకోపం ఎందుకో రేవతికి ఎంత ఆలోచిం చినాఅర్థం కాలేదు. భగవాన్! ఎప్పుడూలేంది ఇలా వున్నా రేమిటి? రాజా ఎదురుగాకూడా యిలా చేస్తే ఇంక పరువు వుంటుందా ? ఏం చేయాలో అర్థంకాని రేవతి కళ్ళనీళ్ళు ఆపుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

క్రిష్ణ పార్కులో కూర్చున్నాడన్నమాటేకాని మనస్సు మనస్సులో లేదు. హు... రేవతి ఎంత సిగ్గులేకుండా ప్రవ ర్తిస్తున్నది. మొదట ఒక్కడినీ స్టేషన్‌కు వెళ్ళమని, తర్వాత తనూ వస్తానంటుంది. ఎంత అసాధ్యులు ఈ ఆడవాళ్ళు. ఐనా రేవతి రమ్మని రాస్తేమాత్రం ఆ రాజాకి బుద్ధి వుండ క్కర్లా ఇక్కడికి రావటానికి. లేకుంటే తనని చవటనిచేసి యిద్దరూ జల్సా చేద్దామనుకున్నారా? కాలేజీలో చదువు తున్నప్పుడు ఇంకా ఎంత బరితెగించి సంచరించారో. ఛీ... ఇలాంటి నీచురాలినా తను పెళ్ళిచేసుకుంది? స్టేషన్‌కే వెళ్ళి అతన్ని ఎడాపెడా వాయించి వస్తే రోగం వదిలి పోతుంది ఇద్దరికీ.... ఎందుకు? తొందరపడకుండా ఒకరోజు

వాళ్ళ ప్రవర్తన కళ్ళారాచూసి ఆపని చేయడం మంచిది. అసలు ఈ పేరు వింటేనే తనకి తేళ్లూ జెఱ్ఱిలూ పాకినట్లుగా వుంటుంది. వారానికి ఖచ్చితంగా నీలంకవరు రావాల్సిందే. ఇక ఆరోజంతా రేవతి ఆనందానికి హద్దులు వుండవు. ఆ వుత్తరంలో ఏమి వుందో చూడాలని ప్రయత్నించినా లాభం లేకపోయింది. వుత్తరం హిందీలో వుంది. తనకీ హిందీకీ చుక్కెదురు. ఈ అవకాశం ఉపయోగించుకుంటున్నారు యిద్దరూ రేవతిని ఒకటి రెండుసార్లు హెచ్చరించాడు పరోక్షంగా. అబ్బే రేవతి అర్థంచేసుకుంటేగా? పైగా వూరుకోకుండా తమరిద్దరూ కలిసి తిరిగిన ప్రదేశాలూ, వేసిన డ్రామాలూ ఇలా ఎన్నో కబుర్లు చెప్తుంది. ఒకసారి తమరిద్దరూ భార్యాభర్తలుగా నటించినప్పుడు ఫస్టుప్రయిజు తనకే వచ్చిందని ఎంత గర్వంగా చెప్తుంది "అలిగితివా సఖీ ప్రియా" అని క్రిష్ణుడుగా రాజా నటిస్తుంటే నిజంగానే తను రాధగా మారిపోయినంత అనుభూతిని పొందిందట! ఐనా రేవతికి ఎంతధైర్యం ఈ విషయాలన్నీ చెప్పటానికి. ఇక అతని కళ్ళ ఎదుటే వాళ్ళు స్వేచ్ఛగా వుంటే తను సహించగలడా? అబ్బ! తల గట్టిగా పట్టుకున్నాడు క్రిష్ణ. ఈ వెధవ ఆలోచనలతో మెదడు వేడెక్కి పోతోంది. టైము తొమ్మిదిన్నర ఐనా యింటికి వెళ్లాలన్పించటంలేదు. పార్కులో జనంఅంతా పల్చబడ్డారు. గేటు మూసేస్తున్నాడు వాచ్‌మన్. తప్పనిసరిగా లేచాడు క్రిష్ణ. కాళ్ళీడ్చుకుంటూ యింటి ముఖం పట్టాడు. దారిలో వేణు సినిమా నుంచి వస్తూ జీప్ ఆపు చేసేవరకూ క్రిష్ణ గమనించనే లేదు.

"ఏరా, ఎవరో ఫ్రెండుకోసం స్టేషన్‌కి. వెళ్లాలని రేవతి కబురు చేసింది కదా; నువ్వు ఇలా రోడ్లు సర్వే చేస్తున్నావేం? అన్నాడు భుజంమీద తట్టి.

"ఆ.... ఏంలేదు ... బొత్తిగా గాలి బంధిస్తేనూ... ఇప్పుడే యిలా వచ్చాను." తడబాటు కప్పి పుచ్చుకుంటూ అన్నాడు. "ఏమిటోయ్ చల్లగాలి రివ్వున వీస్తుంటే...అసలు నువ్వు ఈ ప్రపంచంలో లేనట్లున్నావే... రా ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోతాం." చెయి పట్టుకు లాగాడు వేణు. కృష్ణ ఖంగారుగా... "ఒద్దు ఒద్దు. నేను నెమ్మదిగా వెడతాను. మీరు వెళ్ళిపొండి. "అన్నాడు ముందుకు సాగిపోతూ.

"ఏమిటి వీడివాలకం... ఈరోజు. రేవతి మీద అలిగాడా, ఏమిటి ..." అనుకుంటూనే జీపులో ఎక్కికూర్చు న్నాడు వేణు.

"కొత్త దంపతులు ఎందుకు పోట్లాడు కుంటారు! మనలాగా పాత జంటకాదుగా రోజుకి ముప్పైమూడు సార్లు జగడమాడేందుకు. సరేగాని త్వరగా పోనియ్యండి నాకు నిద్రవస్తోంది" కమల హెచ్చరికతో జీప్ సాగిపోయింది.

అమ్మయ్య, అనుకున్నాడు కృష్ణ. ఎలాగైనాతప్పదుగా యింటికి వెళ్ళకుండా. కాని ఎంత ఆలస్యంగా వెడితే అంత మంచిది. నెమ్మదిగా నడుస్తున్నాడు ఆలోచిస్తూ.

"బాబు గారూ, స్వీట్లు ఏవైనా కావాలా ఇప్పుడే తయారైనాయి. వేడివేడిగా వుంది బాదంహల్వా. ఎంత ఖువ్వ మంటారు" షావువాడు తనని వుద్దేశించి అడిగేవరకూ

తను ఎక్కడ వున్నదీ గుర్తించలేదు. రేవతికి యిష్టమని రెండు మూడు సార్లు బాదం హల్వా తీసుకోవటం వల్లనే అతను అడిగాడు. "ఏమీ అక్కర్లా" అంటూనే ముందుకు సాగాడు.

ఇంట్లోంచి నెమ్మదిగా విన్పిస్తున్నాయి మాటలు. ఏం మాట్లాడుతున్నారో వినాలనే ఆకాంక్ష బయలుదేరింది క్రిష్ణకి. కాని సంస్కారయుతమయిన అతని హృదయం వప్పుకోలేదు అలా వినటానికి. అయినా స్నేహితులు గనుక రేవతీ రాజా చనువుగా వుంటారేమో. అది తను అపార్థం చేసుకుంటూన్నాడేమో... రేవతి ముఖంలో అలాటి దౌర్భాగ్యపు చిహ్నాలు ఏమీ కన్పించవే! ఏమో ఎలా నమ్మటం. మనస్సు దిటవు చేసుకుని మెల్లగా తలుపు తట్టాడు. లోపలనుంచి రేవతి గొంతు మెల్లగా విన్పించింది....

"అబ్బ— వుండు.... నన్ను లేవనీ. వచ్చినట్లున్నారు"

క్రిష్ణ గుండెల్లో ఈటెల్లాగా గుచ్చుకున్నాయి ఆ మాటలు. రేవతి మాటకి బకులుగా నవ్వుతున్న రాజు గొంతు విన్పించింది. 'ఇదేమిటి, ఈ హీరోగారి నవ్వు ఇలా వుందేమిటి ఆడవాళ్ళ నవ్వులాగా!' కసిగా అనుకున్నాడు మనస్సులో. తలుపు తీసిన వెంటనే వెళ్ళి మంచంమీద నుంచి లాగి రెండు ఘుచ్చుకుంటే... ఎంతో ప్రయత్నంతో తనని తాను నిగ్రహించు కున్నాడు.

తలుపు తీసి రేవతి నెమ్మదిగా "ఏమిటండీ.... మేమిద్దరం మీకోసం యింతవరకూ ఎదురు చూసిచూసి విసుగెత్తి

పోయాం. స్టేషనుకు రాకపోగా కనీసం త్వరగానైనా ఇంటికి రాకూడదా అని చాలా కోపం వచ్చింది రాజాకి. అనవసరంగా నామీద కోపంతో మీరు బాధపడి నన్ను బాధ పెడుతున్నారు. ఈ మూగబాధ నేను భరించలేను" దాదాపు ఏడుస్తున్నట్లుగా అంది. ఏ జవాబూ రాకపోవడంతో తల ఎత్తి అతని ముఖంలోకి చూసి నిర్ఘాంత పోయింది. అతని ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. కోపంతో ముఖం జేవురించింది. అతన్ని చూస్తూంటే రేవతికి మతే పోయింది. "ఏమండీ, సాయంత్రం నుంచీ అలాగున్నారు. ఆఫీసులో ఏమైనా జరిగిందా"అంది ఆతురతగా అతని దగ్గరగా వచ్చి.

గొంగళి పురుగును విదిలించినట్లు విదిలించేశాడు రేవతిని. లోపలినుంచి శబ్దమైంది మెల్లగా. రేవతి ఖంగారుగా "ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను. రాజాను పరిచయం చేస్తాను రండ లోపలికి" అంటూనే అతను ఏమి చెప్తాడో వినిపించుకోకుండానే "రాజా....ఇలా రా....యిదుగో మా శ్రీవారు. ఇక నిన్ను పరిచయం చేయాలిగా ... రా మరీ .." అంటూ లేని నవ్వు తెచ్చిపెట్టుకోవటానికి వ్యర్థ ప్రయత్నంచేసి రా అంటూ తలుపు దగ్గరకు వెళ్ళింది రాజాను లాక్కు రావటానికి. కృష్ణ గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అతనితో తను సభ్యతగా మాట్లాడ గలడా? అందగాడూ ధనవంతుడూ, అయిన అతని ముందు తను దిగదుడిచినట్లుగా వుంటే. కర్టెన్ నెమ్మదిగా కదిలింది. రేవతీ తర్వాత రేవతి చెయ్యి పట్టుకున్న రాజాను చూచిన కృష్ణ

"ఆ.... రాజా....?" అంటూ తెల్లబోయాడు. "నమస్తే అంటూ చేతులు జోడించిన రాజాముఖం ఒక్క క్షణం పాలిపోయింది.

ఎంతో సంస్కార వంతుడని గొప్పలు చెప్పింది రేవతి అదంతా వట్టిదేనా ఏమిటి, ఇతను ఇలా జంతువు లాగా చూస్తాడు. రాజా మనస్సు ఒక్క సెకండ్ బాధగా ఐపోయింది. రేవతికి అసలు ఏమీ అర్థం కాలేదు. కృష్ణ తనని తను సంభాళించుకుని "ఓ.... సారీ.... నమస్తే చాలా ఆలస్యంగా చెబ్తున్నందుకు క్షమించండి" అన్నాడు తన ఖంగారు కప్పి పుచ్చుకుంటూ. తేలికగా నవ్వేశారు ముగ్గురూ. అమ్మయ్య అనుకుంది రేవతి మనస్సులోనే. కృష్ణని రాజా రెండు జడలు వెక్కిరిస్తున్నట్లుగా వున్నాయి. సాయంత్రం నుంచీ తను ఎంత మూర్ఖంగా ఆలోచించి ఎంత నరకం అనుభవించాడూ. అమాయకురాలైన రేవతిని ఎంత అపార్థం చేసుకున్నాడు తను ఛీ. ఛీ... తనమీద తనకే కోపం వచ్చింది క్రిష్ణకి. కుశల ప్రశ్నల తర్వాత భోజనానికి లేచారు ముగ్గురూ. యాంత్రికంగా అన్నీ పనులూ చేస్తున్నా రేవతి మనస్సు మనస్సులో లేదు. కృష్ణ ప్రవర్తన బొత్తిగా అర్థంకాలేదు. రాజాని యిదివరకు ఏమైనా ఎరుగున్నాడా? రాజాకే తెలిస్తే యింత కొత్తగా ఎందుకు వుంటుంది. ఆమె ముఖంలో ఏమీ మార్పు లేదే. లేదు. రాజాకేం తెలియదు క్రిష్ణ మనస్సులోనే ఏదో వుంది. ఆలోచిస్తూ గదిలోకి వచ్చిన రేవతిని క్రిష్ణ దగ్గరగా లాక్కుని ముద్దులతో ముంచెత్తేశాడు. అసలే ఏదో పరధ్యాన్నంగా ఆలోచిస్తూన్న

రేవతికి చిరాకు వేసింది. "ఏమిటి మీకుగాని ఈ రోజు మతిపోలేదుగదా? నాకు మాత్రం చాలా భయంగావుంది బాబూ. కాసేపు అనురాగం, కాసేపు ఆగ్రహం. నేను భరించలేను." కళ్ళనీళ్ళతో దూరంగా జరిగింది.

"రేవతీ... ఏమీలేదు. సాయంత్రం ఆరు నుంచీ నేను నరకం అనుభవించి నిన్ను అనవసరంగా బాధపెట్టావు. నన్ను మన్నించవూ. అవన్నీ సరే, మీ రాజా పూర్తిపేరు ఎప్పుడూ చెప్పలేదేం?" ఆమె చేతిని మృదువుగా నొక్కుతూ అన్నాడు.

"మీరు ఎప్పుడూ అడగలేదు. నేను చెప్పలేదు. ఐనా అంత అవసరం రానూ లేదు. పూర్తిపేరు రాజశ్రీ. వాళ్ళ అమ్మా నాన్నా మొగపిల్లలు లేనందువల్ల రాజా అంటూ మొగపిల్లాడిని పెంచినట్లే పెంచారు. రాజాకూడా ఎక్కువగా పాంటూ షర్టూ వేసుకుని క్రాపుతో అచ్చంగా మగవాడు లాగానే తిరిగేది. అందుకే మేమిద్దరం కాలేజీ డ్రామాల్లో భార్యాభర్తలుగా నటించే వాళ్ళం. ఇప్పుడే పెళ్ళి చేయాలను కోవటంతో రెండు జడలూ చీరెలూ అలవాటు చేసుకుంటున్నది. క్రొత్తగా చూసిన వాళ్ళందరూ మగవాడే అనుకునేవాళ్ళు. కొంపతీసి మీరుకూడా అలాగే అనుకోలేదు గదా?" అంది అతని కళ్ళల్లోకి పరీక్షగా చూస్తూ.

క్రిష్ణ ఖంగారుగా "లే లేదు.... రేవతీ.... అలా ఏం అనుకోలేదు. కాని రేపు శలవు పెట్టేస్తాను. ముగ్గురం కలిసి హాయిగా తిరుగుదాం... ఈ రోజు ఏదో చికాకులో నిన్ను బాధపెట్టాను. ఇకముందు ఇలా చెయ్యనుగా" యదార్థం

తప్పుకునేందుకు ఆ పురుష హృదయం ఒప్పుకోలేదు. క్రిష్ణ మనస్సు తేలిక కావటంతో వుత్సాహం వురకలు వేసింది. రేవతిని రెండు చేతులతోనూ పసిపిల్లను తిప్పినట్లు గిర్రున తిప్పేశాడు. భయంతో కళ్లు గట్టిగా మూసుకున్న రేవతి ఏం మగవాళ్లు? ఏది వచ్చినా పట్టలేరు. అంటూ అతన్ని గట్టిగా పట్టుకుని వుండిపోయింది పడిపోతాననే భయంతో.

—౧౦౫—